క్లుప్తంగా

పొగాకు ఉత్పత్తుల విక్రయం నేరం



గీసుకొండ : ప్రభుత్వం నిషేధించిన పొగాకు ఉత్పత్తుల విక్రయం చట్టరీత్యా నేరమని సీఐ బాబూలాల్ తెలిపారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 15వ డివిజన్ మొగిలిచర్లలో నిషేధిత పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తున్నారన్న సమాచారంతో సీఐ బాబూలాల్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ బాబూలాల్ రికార్డులను ప్రత్యక్షంగా పరిశీలించారు. చిగురు మమత, రాధిక వారి షాపుల వద్ద నిషేధిత పొగాకు ఉత్పత్తులను అమ్ముతుండగా అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సినారె జయంతి



చెన్నారావుపేట : మండల కేంద్రంలోని కేజీబీవీలో సినారె (సింగిరెడ్డి నారాయణరెడ్డి) జయంతి సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నారాయణరెడ్డి సందేశాన్ని 10వ తరగతి విద్యార్థిని సుష్మ ఉపన్యాస, శ్రావ్య, సౌమ్య కవితల రూపంలో వినిపించారు. అనంతరం బోనాల వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తేజస్విని, దేవిక, కమల, తదితరులు పాల్గొన్నారు.

నివాళి



చెన్నారావుపేట : మండలంలోని బోడ మాణిక్యం తండాకు చెందిన భూక్య జీవన్ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందగా అతడి మృతదేహానికి నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, మంద యాకయ్య గౌడ్, మాజీ ఎంపీటీసీ రమ బాయి, మైబు సింగ్ రాథోడ్, కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు సాధు మధుసూదన్ రెడ్డి, నన్నెబోయిన రమేశ్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌లు సిద్దన రమేశ్, తప్పెట రమేశ్, నాయకులు బొంత శ్రీను, కుండె కుమారస్వామి, రూపిక శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

జగ్గుతండాలో..

పర్వతగిరి : మండలంలోని గోరుగుట్టతండా శివారు జగ్గుతండాకు చెందిన భానోతు చక్రు అనారోగ్యంతో సోమవారం మృతి చెందగా ఆయన మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ అధ్యక్షుడు భానోతు భాస్కర్, ఎస్టీ సెల్ నాయకుడు లచ్చునాయక్, మాజీ ఎంపీటీసీ మహ్మద్ అలీ, మైనార్టీ సెల్ నాయకులు అక్బర్ పాషా, వాగ్యనాయక్, మురారిశెట్టి మహేశ్, మాజీ సర్పంచ్ జగ్గునాయక్, గ్రామ మాజీ ఉపసర్పంచ్ రవి, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర నిధులు



తొర్రూరు: విద్యకు బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు అన్నారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ కేంద్రంలో సంఘ నిర్మాణ సమావేశం నిర్వహించారు. నరసింహారావు మాట్లాడుతూ.. ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్, కాస్మోటిక్ ఛార్జీలు వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం పీడీఎస్‌యూ డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా నందీశ్వర్, ప్రధాన కార్యదర్శిగా రామ్‌చరణ్, ఉపాధ్యక్షుడిగా లోకేష్, సహాయ కార్యదర్శిగా గణేష్, కోశాధికారిగా నరేందర్ ఎన్నికయ్యారు. సభ్యులుగా వీరన్న, సిద్ధు, రవీందర్, సాయి, సుమన్, రవీందర్, సాగర్ నియమితులయ్యారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

మామునూరు: మామునూరు ఆర్టీసీ బస్‌షెల్టర్‌లో సోమవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఘటనా స్థలానికి స్థానిక కార్పొరేటర్ ఈదురు అరుణ విక్టర్‌తో కలిసి ఎస్సై కృష్ణవేణి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేశారు. వివరాల కోసం మామునూరు పోలీసులను సంప్రదించాలని ఎస్సై కోరారు.

నడకా.. నరకప్రాయమే

- జమలాపూర్–వడ్లకొండ రోడ్డు దుస్థితి
- రైతులు, ప్రజలకు తప్పని తిప్పలు

పర్వతగిరి : మండలంలోని జమాల్‌పూర్–వడ్లకొండ రోడ్డులో నడక సైతం నరకప్రాయమేనంటూ రైతులు, ప్రజలు వేదనకు గురవుతున్నారు. ఏటా వర్షాకాలంలో ఆ దారి మీదుగా రాకపోకలు సాగించడంలో ఇబ్బందులు ఎదుర్కోవడం పరిపాటి. బురదమయంగా మారిన సదరు రోడ్డు మీద వాహనాల రాకపోకలతో నడక దారిన వెళ్లే వారికి రోడ్డు నరకం చూపిస్తోందంటే అతిశయోక్తి లేదు. మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై నీరు నిలిచి వాహనాల రాకపోకలతో మరింత అధ్వానంగా తయారైంది. జమాల్‌పూర్ నుంచి వడ్లకొండకు సుమారు మూడు కిలోమీటర్ల దూరం మట్టి రోడ్డు ఉండగా గత ప్రభుత్వం మట్టితో రోడ్డు పోసి చేతులు దులుపుకుందన్న అపవాదు ఉంది. మార్గమధ్యలో బ్రిడ్జి నిర్మించారు. బురద రోడ్డులో నడుస్తూ పొలాలకు వెళ్లక తప్పని పరిస్థితి నెలకొందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సదరు మూడు కిలోమీటర్ల దారిని బీటీ రోడ్డుగా మారిస్తే రైతులు, ప్రజల కష్టాలు తీరుతాయన్నది జగమెరిగిన సత్యం. ఆ దిశగా ప్రభుత్వం, అధికారులు చొరవ చూపాలని ప్రజలు ఆశిస్తున్నారు.



బురదమయంగా మారిన రహదారి

బీటీ రోడ్డు వేయాలి



జమాల్‌పూర్ నుంచి వడ్లకొండకు వెళ్లే దారిపై కంకర పోసి తొక్కించి బీటీ రోడ్డుగా మార్చాలి. రాకపోకలు సాగించడంలో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదు. ప్రభుత్వం, అధికారులు స్పందించి రోడ్డు వేయాలి.

-జిల్లా కనకయ్య, జమాల్‌పూర్ గ్రామస్తుడు

పొలానికి వెళ్లాలంటే భయం



వర్షాకాలంలో వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లాలంటే భయమేస్తోంది. ప్రభుత్వాలు మారినా రోడ్డు సమస్య పరిష్కారం కావడం లేదు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదు. పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారు. తక్షణమే రోడ్డు వేయాలి.

-పిడుగు కట్టయ్య, రైతు

గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం

జమాల్‌పూర్–వడ్లకొండ్ల రహదారి నిర్మాణానికి ప్రభుత్వానికి గతంలోనే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఇంకా అనుమతులు రాలేదు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మరోసారి అనుమతుల కోసం ప్రయత్నిస్తా. రహదారి ఏర్పాటుకు కృషి చేస్తా.

-రత్నశేఖర్, ఏఈ, ఆర్ అండ్ బీ

ప్రజాసమస్యలపై ప్రతిపక్షమై గళమెత్తండి

- ఊపిరి ఉన్నంత వరకు సేవ చేస్తా
- బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి

రాయపర్తి : ప్రజాసమస్యలపై ప్రతిపక్షమై గళమెత్తాలని బీఆర్‌ఎస్ శ్రేణులకు ఆ పార్టీ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఊపిరి ఉన్నంత వరకు సేవ చేస్తానని భరోసా ఇచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ సాధ్యం కాని హామీలతో గారడీ చేసి గద్దెనెక్కి తదనంతరం ప్రజలను విస్మరించిందని విమర్శించారు. హామీలను అమలు చేయకుండా మోసపూరితంగా కాలం వెళ్లదీస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలతో ఫెయిల్యూర్ ప్రభుత్వంగా మిగిలిపోతుందని చెప్పారు. మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకువెళ్లే దిశగా అన్ని గ్రామాల నుంచి బలమైన కార్యకర్తలను తయారు చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యకర్తలందరూ సమన్వయంతో పని చేసి పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని సూచించారు. సోషల్ మీడియాలో తనపై వస్తున్న పుకార్లను నమ్మవద్దని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు. బరిలో నిలిచే అభ్యర్థులకు అన్ని విధాలా అండగా ఉండి గెలిపించుకుంటానని హామీ ఇచ్చారు. పార్టీ, ప్రజల కోసం శ్రమించే కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని చెప్పారు. త్వరలోనే అన్ని గ్రామాల్లో సమీక్షా సమావేశాలు నిర్వహించి కార్యకర్తల శ్రమకు తగిన గుర్తింపు ఇస్తామన్నారు. పార్టీ బలోపేతానికి భవిష్యత్ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో పార్టీ మండల ఎన్నికల ఇన్‌చార్జ్ గుడిపూడి గోపాల్‌రావు, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, జిల్లా నాయకులు బిల్లా సుధీర్‌రెడ్డి, ఆకుల సురేందర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, నాయకులు పూస మధు, నయీమ్, చెవ్వు కాశీనాథం, నర్మద, సంతోష్‌గౌడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దయాకర్‌రావు

వాహనదారులు నిబంధనలు పాటించాలి

నల్లబెల్లి : వాహనదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సీఐ రాజగోపాల్ కోరారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై పోలీసులు సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు లేని పలువురికి జరిమానా విధించారు. అనంతరం సీఐ మాట్లాడారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలనూ ఖచ్చితంగా కలిగి ఉండాలని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దని, హెల్మెట్ ధరించాలని, పరిమితికి మించి ప్రయాణికులు తరలించొద్దని, తదితర సూచనలు చేశారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్సై ప్రశాంత్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



కారును తనిఖీ చేస్తున్న సీఐ రాజగోపాల్

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని లక్నెపల్లి గ్రామంలోని జెడ్పీ సెకండరీ పాఠశాలలో 2006–07 విద్యాసంవత్సరంలో పదో తరగతి అభ్యసించిన పూర్వవిద్యార్థులు గీసుగొండ మండలంలోని కొమ్మాల గ్రామంలోని ఫంక్షన్ హాల్ ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని స్నేహితులతో సందడి చేశారు. నాడు విద్యాబోధన అందించిన ఉపాధ్యాయులు రవికుమార్, కృష్ణమాచార్యులు, దేవేందర్, సాంబమూర్తి, ఆశ్లేష, రమేష్‌లను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు ఉమామహేశ్వర్, సురేష్, రాజు, సతీష్, శివ, భిక్షపతి, శ్రీవాణి, స్రవంతి, మమత, రజిత పాల్గొన్నారు.

అనాథ బాలికకు ఆర్థిక చేయూత

గూడూరు: మండలంలోని మట్టివాడకు చెందిన ఓ నిరుపేద అనాథ బాలిక పదో తరగతి వరకు ప్రభుత్వ బాలసదనంలో చదువుకుంది. ఆ తరువాత ఇంటర్ లేదా నర్సింగ్ చదువుకోవాలనే ఉద్దేశంతో మానుకోట జిల్లా కేంద్రంలోని బాలరక్ష భవన్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ పర్సన్ డాక్టర్ నాగమణికి తన ఆర్థిక ఇబ్బందిని తెలిపింది. ఆమె వెంటనే ఆడపిల్లల అభివృద్ధికి సహకరించే తనకు తెలిసిన ఎఫ్ఎంఎంఎస్ఎస్ అనే స్వచ్ఛంద సంస్థకు బాలిక వివరాలు తెలిపి, నర్సింగ్ చదువుకోవడానికి అయ్యే ఖర్చు సహాయం చేయాలని కోరింది. అందుకు సంస్థ వారు స్పందించి వెంటనే బాలిక నర్సింగ్‌కు అవసరమైన రూ.13,250 చెక్కును డాక్టర్ నాగమని ద్వారా పంపించగా, సోమవారం బాలరక్ష భవన్‌లో చెక్కును బాలికకు అందించారు. ప్రాజెక్టు డైరెక్టర్ సహాయ, మేనేజర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉద్యోగికి సన్మానం

ఐనవోలు : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో ఆరోగ్య విస్తరణ అధికారి (హెచ్‌ఈఓ)గా విధులు నిర్వహించి వరంగల్ జిల్లా పరిధిలోని నర్సంపేట మండలంలోని బానోజీపేట గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ అయిన రాజేంద్ర ప్రసాద్‌ను టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు సోమవారం శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అంకితభావంతో విధులు నిర్వర్తించి మంచిపేరు తెచ్చుకోవాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న కౌలు రైతు మృతి



సారంగం (ఫైల్)

దుగ్గొండి : క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన కౌలు రైతు పరిస్థితి విషమించి ఆస్పత్రిలో మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. మండలంలోని నాచినపల్లికి చెందిన దూడెల సారంగం (45) గ్రామంలోని ఓ రైతు వద్ద రెండెకరాల వ్యవసాయ భూమి కౌలుకు తీసుకుని వ్యవసాయం చేపట్టాడు. ఇద్దరు పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నాడు. ఈ క్రమంలో పంటలు సరిగా పండకపోవడంతో అప్పుల పాలయ్యాడు. పిల్లల చదువులకు సైతం కొంత అప్పు అయ్యింది. మొత్తంగా అప్పు రూ.10 లక్షలకు చేరింది. అప్పు ఎలా తీర్చాలో తెలియడం లేదంటూ కొద్ది రోజులుగా కుటుంబీకులు, సన్నిహితుల వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. కాగా సారంగం ఈనెల 27న సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం నర్సంపేట ఆస్పత్రికి తరలించారు. మూడ్రోజులపాటు చికిత్స పొందిన సారంగం పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు.

వైద్యశిబిరం

గంగారం: మండలంలోని జక్కన్నపల్లి తండాలో నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ ఫౌండర్ డాక్టర్ రవీందర్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. ఈప్రాంతంలో ఆర్ఎంపీ కూడా లేకపోవడం బాధాకరమన్నారు. మరిన్ని వైద్యశిబిరాలు నిర్వహించేలా చర్యలు చేపడుతామన్నారు.

ఉద్యోగులకు అంకితభావం అవసరం

పెద్దవంగర: ఉద్యోగులకు అంకితభావం అవసరమని బొమ్మకల్లు గ్రామస్తులు అన్నారు. మండలంలోని బొమ్మకల్లు పంచాయతీ కార్యదర్శి నరేష్ బదిలీ కాగా సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగులకు బదిలీలు సహజమేనని, ఎక్కడ పని చేసినా ప్రజల గుండెల్లో నిలిచేలా విధి నిర్వహన ఉండాలన్నారు. గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాడిశెట్టి సైదులు, శారద, మాజీ ఎంపీటీసీ పసుపులేటి వెంకట్రామయ్య, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు రెడ్డబోయిన గంగాధర్, కారోబార్ గిరగాని కుమారస్వామి, స్థానికులు గిరగాని ఐలయ్య, రంగన్న, సులోచనలు పాల్గొన్నారు.

చీరల పంపిణీ

తొర్రూరు: చీదర మహేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ కేంద్రంలోని వేమన నగర్‌లో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. సామాజిక సేవా కార్యక్రమాలకు చేయూత అందించాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నవీన్‌కుమార్, జోన్ చైర్‌పర్సన్ రేగూరి శ్రీదేవి, ప్రతినిధులు కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ ఆధ్వర్యంలో వనభోజనాలు

తొర్రూరు రూరల్: ఆషాఢమాసం పండుగను పురస్కరించుకొని శ్రీ మార్కండేయ చేనేత యువజన సంఘం వారి ఆధ్వర్యంలో మండలంలోని పత్తేపురం గ్రామ శివారులోకి వనభోజనాలకు సోమవారం వెళ్లారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కందకంట్ల సోమశేఖర్, వనం మోహన్, కూరపాటి జగన్, చిలుకమారి భాస్కర్, పారిపెల్లి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

శుభకార్యాలకు అద్దె బస్సులు

తొర్రూరు: వివాహాది శుభకార్యాలకు అద్దెకు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంచుతున్నట్లు తొర్రూరు డిపో మేనేజర్ పద్మావతి తెలిపారు. శుభకార్యాలతో పాటు విహార యాత్రలకు అద్దెకు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ బస్సులను ఆర్టీసీ అందుబాటులో ఉంచుతుందన్నారు. స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 99592 26053, 70321 82456 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

దిగబోసుడు ఉత్తదే.. నమ్మొద్దు



దీపం, నిమ్మకాయలను తొలగిస్తున్న ఎస్సై

దుగ్గొండి : దిగబోసుడు.. ఉత్తదేనని, మూఢాచారమని.. ఎవరూ నమ్మొద్దని ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. మండలంలోని మందపల్లి గ్రామ శివారులోని చాపలబండ మూలమలుపు వద్ద గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి జిల్లేడు ఆకులు, నిమ్మకాయలు వేసి దీపం వెలిగించి వెళ్లారు. దీంతో తీవ్ర భయభ్రాంతులకు గురైన గ్రామస్తులు ఎస్సై వెంకటేశ్వర్లు సమాచారం ఇచ్చారు. సిబ్బందితో ఘటనా స్థలికి ఆయన చేరుకుని స్వయంగా దీపాన్ని, జిల్లేడు ఆకులను, నిమ్మకాయలను తొలగించారు. అనంతరం ప్రజలను చైతన్యవంతం చేసేలా ప్రసంగించారు. గ్రామాల్లోని మూడు బాటల వద్ద కొందరు నిమ్మకాయలు, నల్లకోడి, బ్రాండీ, పసుపు, కుంకుమ, నల్లగుడ్డలు, ఎర్రగుడ్డల పేరుతో దిగబోసుడు చేస్తారని తెలిపారు. అది మూఢాచారమని.. అంతా ఉత్తదేనని తేటతెల్లం చేశారు. అలాంటి వాటిని నమ్మొద్దని ప్రజలకు సూచించారు. మాయలు, మంత్రాలు లేవన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేలా ఎవరు వ్యవహరించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వనమహోత్సవం సామాజిక బాధ్యత



మొక్కలు నాటుతున్న సీఐ నరేష్‌రెడ్డి, గీత కార్మికులు

చెన్నారావుపేట : వనమహోత్సవాన్ని సామాజిక బాధ్యతగా ఎక్సైజ్ శాఖ సీఐ నరేశ్‌రెడ్డి అభివర్ణించారు. మండలంలోని పాపయ్యపేటలో ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరై తాటి, ఈత మొక్కలను నాటారు. అనంతరం మాట్లాడారు. సమాజంలోని ప్రతీఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలని భవిష్యత్ తరాలకు అందించాలని సూచించారు. తాటి, ఈత మొక్కలను నాటితే భవిష్యత్‌లో గీత కార్మికులకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు కత్తి స్వామి, మేడి సుధాకర్, మాజీ అధ్యక్షులు బండి రమేష్, బుర్ర సుదర్శన్, మదూరి బుచ్చిరాములు, రవి, సతీష్, బాబు, సంతోష్, యాదగిరి, సాయిలు, నర్సయ్య, నారాయణ, సుదర్శన్, సిబ్బంది లింగేశ్వర్, రామ్మూర్తి, సుధీర్, నాగరాజు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వెంకట్‌రెడ్డి, నాయకులు

చెన్నారావుపేట : నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవతో మండలంలోని అమృతండాలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, అమృతండా గ్రామ కమిటీ అధ్యక్షుడు బోడ నర్సింహ, మాజీ ఉపసర్పంచ్ వెంకన్న తెలిపారు. అధికారులు సోమవారం ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయగా వెంకట్‌రెడ్డి, నర్సింహ, వెంకన్న పరిశీలించి మాట్లాడారు. పాత ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. ఎమ్మెల్యే తక్షణమే స్పందించి విద్యుత్ శాఖ డీఈని ఫోన్‌లో ఆదేశించడంతో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ మజ్జిగ రాంబాబు, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు భాస్కర్, బోడ ధన్‌సింగ్, లైన్‌మెన్ శ్రీనివాస్, శివ, బానోతు వీరాసింగ్, తారాసింగ్, రాజు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కార్గో సేవలు వినియోగించుకోవాలి



కార్గో పాయింట్‌ను ప్రారంభిస్తున్న రామయ్య

ఖానాపురం : ఆర్టీసీ కార్గో సేవలను ప్రజలు వినియోగించుకోవాలని వరంగల్ రీజియన్ లాజిస్టిక్స్ సేల్స్ టీమ్ లీడర్ రామయ్య కోరారు. మండలంలోని బుధరావుపేటలో టీజీఎస్‌ఆర్టీసీ లాజిస్టిక్ కౌంటర్, కార్గో పాయింట్‌లను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్గో ద్వారా తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటకలకు త్వరితగతిన సేవలు అందుతాయని చెప్పారు. తక్కువ ధరలకే పార్సిళ్లు చేరుస్తున్నట్టు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలకు సైతం సేవలు అందుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో నర్సంపేట డిపో లాజిస్టిక్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ నరేందర్, కౌంటర్ ఏజెంట్ షేక్ సలీమ్, జానీ, లింగిడి వెంకటేశ్వర్లు, బత్తిని శ్రీనివాస్, ఎల్లాగౌడ్, నందగిరి రజని, బాబర్, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించండి

ఖిలా వరంగల్: సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలను పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అరూరి కుమార్ డిమాండ్ చేశారు. వరంగల్ అండర్ బ్రిడ్జి జీపుల అడ్డా సమీపంలోని సంక్షేమ హాస్టళ్లను వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో సమస్యలపై అధ్యయన యాత్రలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్టల్ విద్యార్థులను కలిసి వారి సమస్యలు, మౌలిక సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు నాసిరకమైన బియ్యంతో వండి పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైద్యాధికారులు నెలకోసారి సందర్శించి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఉసిల్ల కుమార్, ఇమ్మడి శ్రీనివాస్, మంద కృష్ణ, దరిపెల్లి కుమార్, ఎలిషా, వెలుశమ్మ పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

ఖిలా వరంగల్: ఈనెల 30 నుంచి రెండు రోజులపాటు వరంగల్‌లోని పీఆర్‌ఆర్ కన్వెన్షన్ హాల్‌లో సైద్ధాంతిక రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి పిలుపునిచ్చారు. వరంగల్‌లోని తమ్మెర భవనంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమకాలిన రాజకీయ పరిస్థితులు, సమాజంలో పెరిగిపోతున్న మతోన్మాదం, లౌకికవాదం, మార్క్సిజం అంటే ఏమిటనే అంశాలపై లోతైన శిక్షణ తరగతులు ఉంటాయని వివరించారు.

కూలీ భరోసా పథకం పెట్టాలి

ఖిలా వరంగల్: జాతీయ ఉపాధి హామీ పనులకు కేంద్రం రూ.2.70 కోట్ల నిధులు కేటాయించాలని, వ్యవసాయ కూలీలకు కూలీ భరోసా పథకం ప్రవేశపెట్టాలని బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు డిమాండ్ చేశారు. వరంగల్‌లోని తమ్మెర భవనంలో హంస మంజుల అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సమగ్ర సంక్షేమ చట్టం చేసి అమలు చేయాలన్నారు. పేదల ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు.